క్లుప్తంగా

వేరే వ్యక్తుల పేరిట రుణం తీసుకోవద్దు



మాట్లాడుతున్న ఏపీఎం గోవిందరావు

రేగిడి: స్వయం సహాయక సంఘాల్లోని మహిళలు వేరే వ్యక్తుల పేరు మీద రుణాలు తీసుకోవద్దని ఏపీఎం బి.గోవిందరావు సూచించారు. స్థానిక ఐకేపీ కార్యాలయంలో వీఏవోలతో శనివారం సమావేశమైన ఆయన.. సంఘ సభ్యులు ఎవరైనా బ్యాంకుల్లో రుణాలు తీసుకుంటే వారి పేరుపైనే తీసుకోవాలన్నారు. ప్రతి నెలా క్రమం తప్పకుండా బ్యాంకుకు చెల్లించాలన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి

రేగిడి: గంజాయి, ఖైనీ, గుట్కా, మద్యపానం వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్‌ఐ పి.నీలావతి సూచించారు. మండలంలోని ఉంగరాడమెట్ట కూడలి వద్ద మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్ప్రభావాలపై శనివారం అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం ఫ్యాషన్ మాయలో పడి ఎంతోమంది విద్యార్థులు, యువత చెడు వ్యసనాలకు బానిసలై తమ జీవితాలు నాశన చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యసనాలకు బానిసలై జీవితాలు నాశనం చేసుకోవద్దన్నారు.

వాహన తనిఖీలు

రేగిడి: మండలంలోని చిన్నశిర్లాం, బూరాడ జంక్షన్ల వద్ద పోలీసులు శనివారం వాహన తనిఖీలు చేపట్టారు. అటువైపుగా వచ్చే వాహనదారులను ఆపి, వారి డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు వాహన ధ్రువపత్రాలను పరిశీలించారు. ఎటువంటి పత్రాలు లేని వారికి అపరాధ రుసుం విధించారు. వాహనాలతో బయటకు వచ్చేటప్పుడు వాహన ధ్రువపత్రాలను వెంట తీసుకురావాలన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ప్రతిఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించి, రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని కోరారు.

ఆకట్టుకున్న ఫొటో ఎగ్జిబిషన్



ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న ఎంపీపీ గౌరి, జెడ్పీటీసీ రామారావు, ఎంపీడీవో రామకృష్ణ

బాడంగి: గణతంత్ర దినోత్సవం సందర్భంగా మండల పరిషత్ కార్యాలయం, తహసీల్దారు కార్యాలయం వద్ద సాంఘిక దురాచారాలపై ఫొటో ఎగ్జిబిషన్‌తో పాటు ముగ్గుల పోటీలు, వ్యాసరచన పోటీలు శనివారం నిర్వహించారు. విజేతలకు గణతంత్ర దినోత్సవం రోజున బహుమతులు ప్రదానం చేయనున్నామని నిర్వాహకులు తెలిపారు.

కొండచిలువల హతం



సీతారాంపురం గ్రామస్తుల చేతిలో హతమైన కొండచిలువలు

తెర్లాం: మండలంలోని పణుకువలస పంచాయతీ, సీతారాంపురంలో మూడు కొండచిలువలు గ్రామస్తుల చేతిలో హతమయ్యాయి. శనివారం గ్రామానికి సమీపంలోని మామిడి తోటల్లో నుంచి ఒక్కొక్కటిగా మూడు కొండచిలువలు గ్రామం వైపు రావడాన్ని గమనించిన కొంతమంది యువకులు వాటిని ప్రాణభయంతో కొట్టి చంపేశారు. ఆ కొండచిలువల్లో ఒకటి 10 అడుగుల పొడవు, మిగిలిన రెండు 6 నుంచి 7 అడుగుల పొడవు ఉన్నాయి.

విద్యాప్రమాణాలు మెరుగుపరచాలి



విద్యార్థితో పుస్తక పఠనం చేయిస్తున్న ఎంఈవో ఎరకయ్య

రేగిడి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాప్రమాణాలు మెరుగుపరచాలని ఎంఈవో బి.ఎరకయ్య సూచించారు. మండలంలోని ఆమదాలవలస, రేగిడి ప్రభుత్వ పాఠశాలలను ఆయన శనివారం సందర్శించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. తరగతుల వారీగా వివిధ ప్రశ్నలడిగి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనాలు వండిపెట్టాలన్నారు.

రీసర్వేలో పొరపాట్లు జరగకుండా చర్యలు

బొబ్బిలిరూరల్: భూముల రీసర్వేలో పొరపాట్లు జరగకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా సర్వే ఇన్‌స్పెక్టర్ నారాయణరావు సూచించారు. మండలంలోని మెట్టవలస గ్రామంలో మలివిడత రీసర్వే శనివారం ఆరంభించారు. భూ విస్తీర్ణం కొలతలతో పాటు ఆన్‌లైన్ మార్పులు, చేర్పుల్లో ఎటువంటి తప్పులు లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఎస్‌డీటీ శివున్నాయుడు, మండల సర్వేయరు సతీష్ తదితరులు పాల్గొన్నారు.

పడకేసిన పల్లె పాలన

- అటకెక్కిన స్వచ్ఛ లక్ష్యం
- కానరాని పారిశుధ్యం
- పట్టించుకోని అధికారులు





చెత్తాచెదారంతో నిండిన ప్రధాన కాలువ

రామభద్రపురం: రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పల్లె పాలన పడకేసింది. ప్రభుత్వం ఏర్పాటై నెలలు దాటుతున్నా ఇప్పటికీ పాలన ముందుకు సాగడం లేదు. కేంద్ర, రాష్ట్ర సంక్షేమ కార్యక్రమాలు సైతం సరిగా అమలుకావడం లేదు. ప్రజాసమస్యలు ఎక్కడివి అక్కడే నిలిచిపోయి పాలన అస్తవ్యస్తంగా ఉంది. గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టే నాథుడే కరువయ్యాడు. ఏ గ్రామం చూసినా ఎక్కడిపడితే అక్కడే వేసిన చెత్తాచెదారం, మురుగుతో నిండిన కాలువలే దర్శనమిస్తున్నాయి. ఫలితంగా దోమలు పెరిగి ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు. దీనికితోడు తాగునీటి కష్టాలు కూడా గ్రామీణులను వెంటాడుతున్నాయి. ఈ సమస్యలు అన్నిచోట్ల ఉన్నా అధికారులు మాత్రం చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని ప్రజల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

తారాపురంలో సమస్యల తిష్ట..

మండలంలోని తారాపురంలో సమస్యలు తిష్ట వేశాయి. క్షేత్ర స్థాయిలో పారిశుధ్యం మెరుగుపడలేదు. డ్రైనేజీలు, గుంతలు చెత్తాచెదారంతో నిండి దోమలకు ఆవాసాలుగా మారిపోయాయి. అయినా అక్కడి పాలకులు గానీ అధికారులు గానీ సమస్యల పరిష్కారానికి చొరవ చూపడం లేదు. అలాగే తాగునీటి సరఫరాలో కూడా నిర్లక్ష్యం వహిస్తున్నారని, గుక్కెడు నీటి కోసం కటకటలాడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని మహిళలు వాపోతున్నారు. ఇసుకతోట వీధిలో తాగునీరు సరఫరా మరింత దారుణంగా ఉందని ఆ వీధి మహిళలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎవరూ పట్టించుకోవడం లేదని మండిపడుతున్నారు.



తారాపురంలో రక్షిత మంచినీటి పథకం ఉన్నా తాగునీటికి గ్రామస్తుల అవస్థలు

ప్రధాన కాలువ ఇలా.. మురుగు పారేదెలా..

తారాపురం గ్రామస్తులను సుదీర్ఘకాలంగా వేధిస్తోన్న ప్రధాన సమస్య మురుగు. ఎన్ని ప్రభుత్వాలు మారినా.. పాలకులు మారినా ఇక్కడి మురుగు సమస్యకు పరిష్కారం మార్గం చూపడం లేదు. గ్రామం మధ్యలో ప్రధాన కాలువ ఉంది. సగం వార్డుల్లోని ప్రజలు వినియోగించిన వాడుక నీరంతా ఇదే కాలువలో వచ్చి చేరుతోంది. అలాగే కొండల నుంచి వచ్చిన నీరు కూడా ఇదే కాలువ ద్వారా వెలుతుంది. ఈ ప్రధాన డ్రెయిన్ నిర్వహణను అధికారులు పట్టించుకోకపోవడంతో చెత్తాచెదారం పేరుకుపోయింది. మురుగునీటి పారుదల ఎక్కడికక్కడ నిలిచిపోయింది. ప్రస్తుతం దుర్వాసన వెదజల్లుతుండడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనికితోడు దోమల బెడద కూడా అధికం కావడంతో అక్కడివారు నరకం అనుభవిస్తున్నారు. కాలువలోని చెత్తాచెదారం తొలగించాలని కోరుతున్నారు.

నెలల తరబడి తాగునీరు రావడం లేదు..



గ్రామంలో చెత్త సేకరణ సరిగా జరగడం లేదు. కాలువల ద్వారా మురుగు ముందుకు కదలడం లేదు. ఇళ్ల ముంగిట నీటి నిల్వలు ఉండిపోవడంతో దోమలు విజృంభిస్తున్నాయి. వీధిలో తాగునీటి సమస్య కూడా ఉంది. నెలల తరబడి కుళాయిల ద్వారా తాగునీరు సరిగా సరఫరా కావడం లేదు. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు.

–పిల్లా శ్రీనివాసరావు, తారాపురం

చర్యలు తీసుకుంటాం..



గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. పంచాయతీ కార్యదర్శులతో సమావేశం ఏర్పాటు చేసి పారిశుధ్యం, తాగునీటి సరఫరా లోపాలు లేకుండా చూస్తాం. త్వరితగతిన సమస్యల పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు జారీ చేస్తాం.

–రత్నం, ఎంపీడీవో, రామభద్రపురం మండలం

పరామర్శ



బొబ్బిలిరూరల్: బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలిరూరల్: మండలంలోని కింతలివానిపేట గ్రామంలో వైఎస్సార్ సీపీ కార్యకర్తలు బంతలకోటి చినఅప్పలనాయుడు, కోమపల్లి కృష్ణలు ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకటచినఅప్పలనాయుడు శనివారం ఆ గ్రామానికి వెళ్లి, బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అండగా ఉంటామని, ఏ అవసరం కావాలన్నా తనను సంప్రదించాలని భరోసానిచ్చారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ తమ్మిరెడ్డి దామోదరరావు తదితరులు పాల్గొన్నారు.



సంతకవిటి: శ్రీనివాసరావును పరామర్శిస్తున్న డాక్టర్ రాజేష్ తదితరులు

సంతకవిటి: మండలంలోని మద్దూరుపేటకు చెందిన వావిలపల్లి శ్రీనివాసరావు భార్య నాగమణి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్, జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్మోహనరావు, కళింగ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ గురుగుబెల్లి స్వామినాయుడులు ఆ గ్రామానికి శనివారం వెళ్లి, ఆ కుటుంబాన్ని పరామర్శించారు. మృతికి గల కారణాలు అడిగి తెలుసుకుని, ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ దాసరి దాలినాయుడు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

రాజాం సిటీ: మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో పారా లీగల్ వలంటీర్ల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని సీనియర్ సివిల్ జడ్జి సీహెచ్.వివేక్ ఆనంద్ శ్రీనివాస్ ఓ ప్రకటనలో శనివారం తెలిపారు. ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయులు, ఉద్యోగులు, వృద్ధులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఎంఎస్‌డబ్ల్యూ విద్యార్థులు, ఉపాధ్యాయులు, వైద్యులు, ఫిజీషియన్లు, రాజకీయేతర సభ్యులు, సేవా దృక్పథం కలిగిన ప్రభుత్వేతర సంఘ సభ్యులు, మైత్రి సంఘ సభ్యులు, స్వయం సహాయక సంఘ సభ్యులు అర్హులన్నారు. పదో తరగతి అర్హతతో పాటు రాజాం, రేగిడి, వంగర, సంతకవిటి మండలాలకు చెందిన వారై ఉండాలన్నారు. ఆసక్తి కలిగిన వారు విద్యార్హత సర్టిఫికెట్లతో పాటు రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలతో ఈ నెల 30వ తేదీలోగా కోర్టు సముదాయంలో సంప్రదించాలన్నారు. పారా లీగల్ వలంటీర్లుగా నియమితులైన వారికి ఎటువంటి పారితోషికం ఉండదన్నారు.

కాలువల నిర్మాణ ప్రతిపాదనలకు చర్యలు

రామభద్రపురం: మండల కేంద్రం మధ్య నుంచి సాలూరుకు వెళ్లే మెయిన్ రోడ్డులో కాలువల నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలకు చర్యలు తీసుకుంటున్నామని ఆర్అండ్‌బీ ఏఈ ప్రణయ తెలిపారు. స్థానిక మెయిన్ రోడ్డుకు ఇరువైపులా పాడైన మురుగు నీటికాలువలను ఆమె శనివారం పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మురుగునీటి కాలువలు పూర్తిగా పాడైపోవడం వాస్తవమేనని, ఇళ్ల నిర్మాణదారులు, దుకాణాదారులు కాలువలపై మెట్లు ఏర్పాటు చేయడంతో పూర్తిగా పూడికలతో నిండిపోయాయన్నారు. కాలువల నిర్మాణానికి నిధులు ఏ మేర అవసరమో పరిశీలిస్తున్నామన్నారు.

పశువ్యాధులపై అప్రమత్తం కావాలి



బాడంగి: రావివలసలో పశువైద్య తనిఖీలు



రాజాం: ఆగూరులో పాడిరైతులకు అవగాహన కల్పిస్తున్న పొగిరి పశువైద్యాధికారి దీపిక

గ్రామగ్రామాన ఉచిత పశువైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. శనివారం పలు గ్రామాల్లోని శిబిరాల్లో పశువులు సహా గొర్రెలు, మేకలు, కోళ్లు వంటి మూగజీవాలకు వైద్య సిబ్బంది తనిఖీలు చేపట్టి, ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం వ్యాధుల నివారణకు ముందస్తు జాగ్రత్తగా టీకాలు, మందులు వేశారు. పశు వ్యాధులపై పాడి రైతులు అప్రమత్తం కావాలని, వ్యాధి లక్షణాలతో మూగజీవాలు బాధపడితే వెంటనే వైద్యులను సంప్రదించి, సలహాలు, సూచనలు పొందాలన్నారు.

–బొబ్బిలి, రాజాం నెట్‌వర్క్

సంక్షిప్తంగా...

సంగమేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

వంగర: మండలంలోని సంగాంలో పవిత్ర సంగమేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు గ్రామాల నుంచి భక్తులు ఇక్కడకు వచ్చి, ప్రత్యేకాభిషేకాలు చేసి, మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అర్చకుడు సిద్ధాంతం గణపతి ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

మంచి ఆహారపు అలవాట్లు అలవర్చుకోవాలి

బొబ్బిలిరూరల్: విద్యార్థి దశ నుంచే అందరూ మంచి ఆహారపు అలవాట్లు అలవర్చుకోవాలని మహారాజ ఆస్పత్రి డాక్టర్ చంద్రశేఖర్ సూచించారు. మండలంలోని అలజంగి గ్రామ ఉన్నత పాఠశాలలో అయోడిన్ ఆవశ్యకతపై శనివారం అవగాహన కల్పించారు. అనంతరం ఆరోగ్యంపై అవగాహన కల్పించే ప్రశ్నలను విద్యార్థులను అడిగి, విజేతలకు బహుమతులు అందజేశారు.

లక్షణాలు గుర్తిస్తే వ్యాధి నివారణ సులభం

రాజాం: లక్షణాలు గుర్తిస్తే క్షయవ్యాధిని సులభంగా కట్టడి చేయవచ్చని క్షయవ్యాధి నివారణ విభాగం డివిజనల్ సూపర్‌వైజర్ జి.లలిత అన్నారు. మండలంలోని అమరాం, ఆగూరు, కొత్తకంచరాం తదితర గ్రామాల్లో క్షయవ్యాధి నిర్మూలనపై అవగాహన ర్యాలీ శనివారం నిర్వహించారు. బొద్దాం పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ సిద్ధేశ్వరి మాట్లాడుతూ వ్యాధిని ఆరంభంలో పసిగడితే త్వరితగతిన నయం చేయడంతో పాటు సకాలంలో వ్యాధి నిర్మూలనకు కృషి చేయవచ్చన్నారు.

తహసీల్దారుకు అవార్డు

రాజాం: తహసీల్దారు ఎస్.కె.రాజుకు ఉత్తమ ఏఈఆర్‌వోగా అవార్డు లభించింది. 2024 సార్వత్రిక ఎన్నికల్లో రాజాం నియోజకవర్గ అసిస్టెంట్ ఎలక్ట్రోరల్ ఆఫీసర్(ఏఈఆర్‌వో)గా ఉత్తమ సేవలు అందించినందుకు గాను ఈ అవార్డు ఆయనను వరించింది. విజయవాడలోని తుమ్మికపల్లి కళాక్షేత్రంలో ఏపీ చీఫ్ సెక్రటరీ కె.విజయానంద్ చేతులమీదుగా అవార్డు అందుకున్నారు. తహసీల్దారుకు ఈ అవార్డు రావడం పట్ల డీటీ రాజశేఖర్‌తో పాటు కార్యాలయ ఉద్యోగులు, రాజాం పట్టణ, మండల ప్రజలు అభినందించారు.

ఫిబ్రవరి 9న ప్రజ్ఞా వికాస్ పరీక్ష



ప్రజ్ఞా వికాస్ పరీక్ష పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

రాజాం సిటీ: జిల్లా వ్యాప్తంగా ఫిబ్రవరి 9వ తేదీన ప్రజ్ఞా వికాస్ పరీక్ష నిర్వహించనున్నామని యూటీఎఫ్ రాష్ట్ర మానటరింగ్ కమిటీ సభ్యుడు రెడ్డి మోహనరావు, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు జె.రవి తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ప్రజ్ఞా వికాస్ పరీక్షకు సంబంధించిన పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ పదో తరగతి పరీక్షకు హాజరుకానున్న విద్యార్థులకు పరీక్షల పట్ల భయాన్ని పోగొట్టేందుకు ఎస్ఎఫ్ఐ, యూటీఎఫ్ సంయుక్తంగా ఈ పరీక్ష నిర్వహించనున్నామన్నారు. పదో తరగతి సిలబస్ ఆధారంగానే ఈ పరీక్ష ఉంటుందన్నారు. ఒత్తిడి అధిగమించేందుకు ఈ పరీక్ష ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఈ పరీక్షకు అన్ని పాఠశాలల పదో తరగతి విద్యార్థులు హాజరుకావాలన్నారు.

టీపీటీఏ డైరీ ఆవిష్కరణ

రాజాం: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఏపీ మున్సిపల్ టీపీటీఏ(టౌన్ ప్లానింగ్ టెక్నికల్ ఆఫీషియల్స్ అసోసియేషన్)–2025 సంవత్సర డైరీ శనివారం ఆవిష్కరించారు. మున్సిపల్ కమిషనర్ జె.రామప్పలనాయుడు చేతులమీదుగా జరిగిన ఈ కార్యక్రమంలో కార్యాలయ ఉద్యోగులు, పట్టణవాసులకు ఉచితంగా డైరీని అందజేశారు. కార్యక్రమంలో టీపీవో తేజేశ్వరరావు, ఏఈ వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

వీజీకే మూర్తి మృతి కార్మిక లోకానికి తీరనిలోటు

రాజాం సిటీ: కార్మిక వర్గ ఉద్యమ నేతగా, నిరంతర కార్యాచరణపరుగుగా పేరొందిన వీజీకే మూర్తి మరణం కార్మికలోకానికి తీరనిలోటు అని కార్మిక నేత సీహెచ్ రామ్మూర్తినాయుడు కొనియాడారు. స్థానిక వైఎస్సార్ పార్కులో వీజీకే మూర్తి సంస్మరణ సభ శనివారం నిర్వహించి, ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాజాం ప్రాంతంలో ఉద్యోగ, కార్మిక సంఘాల నిర్మాణంలో కీలకపాత్ర పోషించారని గుర్తుచేశారు. ఈ ప్రాంతంలో జరిగిన అనేక కార్మిక పోరాటాల్లో ప్రత్యక్షంగాను, పరోక్షంగానూ పాల్గొని, కార్మిక వర్గానికి అండగా నిలిచిన గొప్ప నాయకుడన్నారు. ఆయన తన జీవితాన్ని పీడిత ప్రజల విముక్తికే అంకితం చేశారన్నారు. కార్యక్రమంలో చిరంజీవి, రమణ, రాంబాబు, నారాయుడు, షేషు, రాము, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమికోన్నత పాఠశాలలు కొనసాగించాలి



ప్రాథమికోన్నత పాఠశాలలను కొనసాగించాలని పీఎంసీ కమిటీ సభ్యులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు. వంగర మండలంలోని మద్దువలస, రుషింగి, పెదరాజులగుమ్మడ, శివ్వాం గ్రామాల్లోని యూపీ(ప్రాథమికోన్నత) పాఠశాలలను ప్రాథమిక పాఠశాలలుగా మార్చివేసే సన్నాహాలు జరుగుతున్న నేపథ్యంలో ఆయా పాఠశాలలను అలాగే నడపాలని విజ్ఞప్తి చేస్తూ సదరు వ్యక్తులు ఎంఆర్‌సీ కార్యాలయ సిబ్బందికి శనివారం తీర్మానం కాపీలను అందజేశారు. వచ్చే ఏడాది నుంచి ఆయా పాఠశాలలను ప్రాథమిక పాఠశాలలుగా మార్చే ఆలోచనను విరమించుకోవాలన్నారు. ప్రస్తుతం అందిన ఈ తీర్మాన కాపీలను డీఈవోకు అందజేస్తామని ఎంఈవో వై.దుర్గారావు తెలిపారు.

–వంగర

దారి కనబడడం లేదు..



పొగమంచు కమ్మేస్తోంది. రాత్రి 7 గంటల నుంచే మంచు కురవడం ఆరంభమై, ఉదయం 9 గంటల వరకు ఉంటోంది. పడుతున్న దట్టమైన పొగమంచు కారణంగా ఎక్కడ ఏం ఉందో కానరావడం లేదు. ఎదురుగా వస్తున్న మనిషి కూడా దగ్గరకు వెళ్తే తప్ప కనిపించని పరిస్థితి. టార్చిలైట్లు, సెల్‌ఫోన్ల లైట్లు వేసుకుని మరీ బయటకు వెళ్లాల్సిన దుస్థితి. ఈ చిత్రంలో కనిపిస్తోన్నది.. తెర్లాం మండలంలో శనివారం కురిసిన మంచు దృశ్యం.

–తెర్లాం

ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలి



బొబ్బిలి పట్టణ పరిధిలోని ఇందిరమ్మ కాలనీలో చోటుచేసుకుంటున్న ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ, ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు కోట అప్పన్నలు డిమాండ్ చేశారు. ఇదే విషయమై వారు బొబ్బిలి మండల కేంద్రంలో విలేకరులతో శనివారం మాట్లాడారు. నిరుపేదలకు ప్రభుత్వం కేటాయించిన స్థలాలను కొంత మంది ఆక్రమించుకుని, పెద్దపెద్ద భవనాలు నిర్మించుకుంటున్నారని ఆరోపించారు. ఇక్కడి నకిలీ పట్టాల వ్యవహారంపై కూడా ఎమ్మెల్యే, అధికారులు స్పందించి, చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే అర్హులైన నిరుపేదలకు ఇళ్లస్థలాలు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో ఆ పార్టీ పట్టణ కార్యదర్శి మునకాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

–బొబ్బిలి

పాలవలస రాజశేఖరానికి ఘన నివాళి



రాజశేఖరం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీపీ సురేష్‌ముఖర్జీ, పార్టీ మండల కమిటీ కన్వీనర్ సుదర్శనరావు

వంగర: రాజకీయ కురువృద్ధుడు, మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు పాలవలస రాజశేఖరం పాలకొండ పట్టణంలోని ఆయన స్వగృహంలో ఇటీవల మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ, పార్టీ మండల కమిటీ కన్వీనర్ కరణం సుదర్శనరావు, జెడ్పీటీసీ కరణం రాధమ్మ తదితరులు శనివారం పాలకొండ వెళ్లి, రాజశేఖరం చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన సేవలను కొనియాడారు. ఆయన మరణం పార్టీకి తీరనిలోటు అని, ఎంతో మంది రాజకీయ నాయకులకు ఆయన ఆదర్శమన్నారు. మండలంలోని వీవీఆర్‌పేటలో ఆ గ్రామ పెద్ద మరిచెర్ల గంగారావు ఆధ్వర్యంలో రాజశేఖరం చిత్రపటానికి గ్రామస్తులు పూలమాలలు వేసి, నివాళులర్పించారు.

సక్రమంగా రికార్డుల నిర్వహణ



సచివాలయ సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

రాజాం సిటీ: మండలంలోని అన్ని సచివాలయాల్లో రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలని ఎంపీడీవో వి.శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని గురవాం గ్రామ సచివాలయాన్ని ఆయన శనివారం సందర్శించారు. ఆయన మాట్లాడుతూ విధులకు సమయానికి హాజరుకావాలని, సచివాలయాల ద్వారా గ్రామంలోని ప్రజలకు అందిస్తున్న ధ్రువీకరణ పత్రాల వివరాలు, సేవలు వివరాలను రికార్డుల్లో పొందుపర్చాలని తెలిపారు. సీనియర్ సిటిజన్, హౌస్ హోల్డ్, పీఏసీఎస్ ఈకేవైసీ, ఎంఎస్ఎంఈ సర్వేలపై దృష్టిపెట్టాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో కె.సాయిరాం, కార్యదర్శి దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

ఓటు వజ్రాయుధం

జాతీయ ఓటర్ల దినోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారులంతా కార్యక్రమంలో పాల్గొని, ఓటు గొప్పతనం, దాని ఆవశ్యకతను వివరించారు. ఓటు వజ్రాయుధం లాంటిదని, ప్రతిఒక్కరూ ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటుహక్కు వినియోగించుకోవాలని కోరారు. మనకున్న ఓటుతో మనకు నచ్చిన వ్యక్తిని ఎన్నుకునే గొప్ప అవకాశం రాజ్యాంగం కల్పించిందన్నారు. 18 ఏళ్లు నిండిన వారంతా ఓటుహక్కు పొందాలన్నారు. అనంతరం ఓటుహక్కు వినియోగంపై ప్రతిజ్ఞ చేశారు. పాఠశాలల్లోని విద్యార్థులకు ఓటు ఆవశ్యకతపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి, విజేతలకు ప్రశంసాపత్రాలు అందజేశారు.

–బొబ్బిలి, రాజాం నెట్‌వర్క్



వంగర మండల కేంద్రంలో ఓటుహక్కు వినియోగంపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ



సంతకవిటి మండల కేంద్రంలో ఓటుహక్కుపై అవగాహన కల్పిస్తూ మానవహారం



తెర్లాంలో వ్యాసరచన, వక్తృత్వ పోటీల విజేతలకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న తహసీల్దారు హేమంత్‌కుమార్



రాజాం సిటీ: రాజాంలోని పాలకొండ రోడ్డులో ఓటు ఆవశ్యకతను తెలుపుతూ జీఎంఆర్ ఐటీ ఎన్ఎస్ఎస్ విద్యార్థుల ర్యాలీ



బాడంగి గురుకుల పాఠశాలలో సీనియర్ సిటిజన్ ఓటర్లను సన్మానిస్తున్న తహసీల్దారు సుధాకర్, ప్రిన్సిపాల్ నారాయణరావు



రామభద్రపురంలో ఓటుహక్కు వినియోగంపై అవగాహన కల్పిస్తున్న తహసీల్దారు సులోచనరాణి తదితరులు



బొబ్బిలిలో సీనియర్ సిటిజన్ ఓటరును సన్మానిస్తున్న ఆర్డీవో రామ్మోహనరావు